# బూరె ముక్కలు

## శ్రీ తెన్నేటి సూరి

ఆ పసిబిడ్డ బక్కపలచగా ఎర్రగా తేలల్లే వున్నాడు. చిన్ని చిన్ని రాగి వెంట్రుకలు చిరుగాలికి కొసలు రేగి కొంచెం పెంకెతనంగా కనుపించుతున్నాడు. సన్నని ఆ మెళ్ళో, జెర్రెపోతులా, ఒక బంగారు నానుతాడూ, దాని చివర ఒక పులిగోళ్ళ పతకం వ్రేలాడుతున్నయ్. దిగంబరి. ఉండీలేనట్లున్న ఆ చిట్టి చిట్టి పిరుదుల మీదికి, జారి జారి పోకుంటూ, మొలచుట్టూ. ఒక బంగారు గజ్జల మొలత్రాడు.

తొందర తొందరగా నడవాలనే ఉత్సాహమంతా తడబడుతున్న ఆ తప్పటడుగుల్లో కనుపించుతూనే ఉంది. ఆలంబనంకోసం అనసాగిన లేత బచ్చల తీగెలా, ఆ సన్నటి, యెర్రటి చెయ్యిచాచి, మునివ్రేళ్ళ చివరలతో ఆ స్త్రీ కుడి భుజాన్ని అందుకో బోతున్నాడు. ఆ ముంజేతిచివర ఆ చెయ్యి మొయ్యలేనంత బరువుగా, ఒక బంగారు పలకల గాజు, వదులై, జంగిడంలా వ్రేలాడుతోంది.

ముసి ముసి నవ్వుల 'సన్నజాజులు' మోవికొసలలో, మోసులెత్తుతున్నయ్. ఆ స్త్రీ భుజంమీద మునివ్రేళ్ళాని, వారగా తల వంచి, ఆ స్త్రీ ముఖంలోకి తొంగిచూచాడు చిరునవ్వుతో. ఆ బిడ్డను ఒళ్ళోకి ఆహ్వానించింది ఆ స్త్రీ. అడ్డాలలో పడుకో బెట్టుకుని రొమ్ము నోటికందించి పైటచెంగు కొంచెంగా కప్పింది ఆ స్త్రీ ముంజేతులమీదుగా రెండు మీగాళ్ళూ జారవేసి, ఒకలయలో ఊపుతూ ఒళ్లుమరచి పాలు త్రాగుతున్నాడు ఆ బిడ్డ. కాళ్ళకు కట్టివున్న వెండి గజ్జలజత, ఒకదానికొకటి కొట్టుకొని, 'జిగ్-జిగ్-జిగ్' మంటున్నయ్. ఆ బిడ్డ త్రాగుతున్న స్తన్యం రక్తముగామారి, పాదాలకువ్యాపిస్తున్నట్టు పాదాలు తామర రేకులల్లే కెంపులు దేరుతున్నయ్.

ఆ స్త్రీ చామనఛాయ వర్ణంలో కొంచెం భారీ మనిషి. బలిష్టమైన అవయవాలు. నాజూకుతనం కొరకపోతే ఆరోగ్యంతో కండలు తేరిన అందమైన చెక్కిళ్ళు. వెనుమాసిన ఆ 20 నెంబరు నేతచీరా, వెలిసి, బూడిదైపోయిన, ఆ ఎర్ర బొంబాయి రవికా, ఆ తల్లి పేదరికాన్ని దాచలేకుండా వున్నయ్. ఆ ముఖం—అందంమాట ఎలావున్నా—చాలా ప్రశాంతం. చిరునవ్వులు ముఖాన్ని ఎప్పుడూ ఆవరించుకొనేవుంటయ్. చాలా మితభాషిణి. ఎప్పుడూ మాట్లాడినట్టే ఉండదు! అథవా యెప్పుడైనా పెదవి కదిపితే, ముసి ముసి నవ్వులు ముందు జారిపడిగాని పలుకులు బయటికి రాలేవు

పండు తములపాకుల పసిడి చెక్కిళ్ళతో పసిడి పువ్వుల యర్ర బనారసు చీరకట్టుకొని మరొక ఇల్లాలు అక్కడకువచ్చి ఆగింది. తెలుగు జాతిలో ఆవిడ చాలా అందకత్తెననాలి ఇరవైయైదు సంవత్సరాల పడుచు ప్రాయంలో బక్కపలచని నాజూకుమనిషి. పచ్చటి శరీరంమీద ఆ కాసుల బంగారపు నగలు, యెందుకూ కొరగాక వెలాతెలా బోతున్నయ్.

"సుబ్బలక్ష్మీ! తరిపిదూడలా ఇంకా వాడికి పాలేమిటి ?— చేరనివ్వకూ — ఎన్నాళ్ళుపోయినా వాడలానే పీక్కుతింటూవుంటాడు. గూబమీద వెయ్యి వెధవని"... అన్నదావిడ.

సుబ్బలక్ష్మి. ఒక చిరునవ్వునవ్వి. నిర్లక్ష్యంగా. మెళ్ళోవున్న నల్లపూసలు సర్దుకుంటోంది.

ఈ మాటలు చెవులబడి ఆబిడ్డ త్రాగే త్రాగే రొమ్ము చివాలున వదిలేసి, ముసుగ్గా కప్పివున్న పైటచెంగు 'చెక్'న అవతలికి త్రోసేసి, ఆ వచ్చిన యిల్లాలివంక చురచురా చూశాడు. చారెడేసి వున్నయ్ ఆ కళ్ళు. అలా చూడ్డంలో ఆ కళ్ళల్లోవున్న రక్తపు జీరలు మరింత యర్రబడ్డయ్. కుడికంట్లో వున్న నల్లటి పుట్టుమచ్చ ఆ అరుణరేఖల నడుమ మిలమిల లాడిపోయింది

ఆవిడ నవ్వుతూ, "ఏడిశావ్! వెధవా!-" అంది.

సుబ్బలక్ష్మి చిరునవ్వునవ్వి. ఆబిడ్డను హృదయానికి హత్తుకుంది. మళ్ళా రొమ్ము నోటికందించి, పైటచెంగు కప్పేసింది

తనే జయించాడు. ఆ సంగతి ప్రదర్శించి తన్నలా మాట్టాడిన ఆ స్త్రీకి, కుఋమోతు తనం తెప్పించాలి. పాలు త్రాగుతూ పాదాలు ఇందాకటికంటే మరింత జోరుగా ఊపేశాడు.

"అ! నీవలా వాణ్ణి ముద్దుజూసినకొద్దీ వాడు నెత్తికెక్కుతాడు. వాడి జాతేంజాతీ!"- అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది ఆ యిల్లాలు.

సుబ్బలక్ష్మి ఆ బిడ్డను ఆప్యాయంగా, హృదయానికి హత్తుకుంది. గర్వంతో సుబ్బలక్ష్మిఎడద భూదేవి వక్షస్థలంలా, మరింత విస్తృతమై విచ్చులుకుని ఆ బిడ్డకు ఆశ్రయ మిస్తోంది.

* * * *

అతఃపూర్వం జరిగిన విషయాలేవీ నాకు తెలియవ్. ఈ జీవితంలో నాకు కొంచెం బుద్ధి తెలిసీ తెలియడంతోటే నాకు అవగత మైన మొట్టమొదటి ఘట్టం ఇదే. అప్పట్లో నా ప్రపంచమంతా ఆఒక్క సుబ్బలక్ష్మి. తక్కిన విషయాలేవీ నాకు తెలిసేవీ కావూ, తెలుసుకోవాలనే అవసరంగాని, ఉత్సాహం గాని, నాకు ఉండేవీ కావు

నన్ను గర్భిణితో వుండగా మా అమ్మకు చాలా జబ్బుచేసిందట. నీళ్ళాడాక ఆవిడ దగ్గిర పాలు లేకపోవటంచేత, నేను పుట్టి నప్పటి నుంచీ లక్ష్మే నాకు పాలిస్తూవుండేది. మాయింట్లో పనంతా లక్ష్మే చేస్తూవుండేది. బయట మా పొలంపాటంతా లక్ష్మి పెనిమిటి సుబ్బన్న చూస్తూవుండేవాడు వంట చేసుకోటం, భోజనం చెయ్యటం, ఇవే మా అమ్మకూ మా బామ్మకూ మిగిలే పనులు. చేతినిండా పనిలేక వాళ్ళకేమీ తోచేదిగాదు. ఏదో చిలిపితగూ ఒకటి లేవదీసి, ఒకరి నొకరు ప్రొద్దస్తమానమూ, తెగసాధించు కుటూ వుండేవాళ్లు — వినేవాళ్ళకి తలవాచి పోయేలా

ఇంతెడు చాకిరీ సుబ్బలక్ష్మి యెముకలు విరుచుకుంటూ వుండేది. తెల్లవారు జామున యెప్పుడు వచ్చేదో, నేను నిద్దర లేచేటప్పటికే బండెడు చెంబులు ముందువేసుకుని వాటికి చింతపండు పులుసూ, వెలిబూడిదా పట్టించి తోముతూ వుండేది. నిద్దరకళ్ళు నులుపు కుంటూ వెళ్ళి, ఆ వీపు మీద పడు కునే వాణ్ణి. మళ్ళా ఒక గ్రుడ్డికునుకు తీసే వాణ్ణి - మా అమ్మ బలవంతాన అన్నానికి పడలాక్కుపోయేదాకా ఆ వెన్నుమీద నాకు లభించిన శాంతి, మళ్ళా నాజీవితంలో ఇంత వరకు మరొక తావున, ఇంకెక్కడా లభించ లేదు. మా అమ్మ ఎప్పుడన్నా కానేపు ఎత్తుకుంటే ఎప్పుడు దించుతుందిరా బాబూ! అనిపించేది. ఊకదాలిబెట్టి, కిటికీలు మూసి వేసిన గదిలా, ఉక్కిరిబిక్కిరిగా ఉండేది. ఎప్పుడూ సుబ్బలక్ష్మి కొంగు కొనపట్టుకు నేను తిరగటం మా అమ్మకి కొంచెం చిరాకు గానే వుండేది. మా అమ్మకూ నాకూ సంబంధం యేమిటో నా కర్ధమయ్యేది కాదు అప్పుడప్పుడు మా అమ్మ నామీద అధికారం చలాయిస్తూ ఉండేది ఏ అధికారంతో ఆవిడ అలా నామీద జులుం చేస్తోందో నాకు తెలిసేది కాదు. అట్లాంటప్పుడు. అనవసరంగా, అక్రమంగా దుండగంగా శిక్షింపబడు తున్న ఒక పెద్ద 'మార్టీరు'కు కలిగే భావా లన్నీ నాలో కలిగేవి. "కొట్టుకుంటే కొట్టుకో"... అనే అర్థం తోచేలా నిర్లక్ష్యంగా

నిల్చుని సత్యాగ్రహం చేసేవాణ్ణి — బుగ్గలు ఎంతైనా మెలేసుకోనీ కాని లక్ష్మిగనక అక్కడుంది, మా అమ్మను కొట్టనియ్యకుండా అడ్డొచ్చిందా - ఇక జూసుకోండి - గగ్గోలుగా ఏడ్చుకుంటూ, పెద్దపెట్టున ఒక విప్లవం లేవదీసేవాణ్ణి

రోజులు గడిచినకొద్దీ, సుబ్బలక్ష్మినుంచి నన్ను దూరదూరంచేసే సంఘటనలు ఎన్నో కల్పింపబడుతూ వుండేవి. అలాంటప్పుడు ఒళ్ళంతా కుదించేసుకుని సుబ్బలక్ష్మిని అల్లుకుపోవాలనిపించేది

సుబ్బలక్ష్మి నాకు నాల్గు చుక్కల పాలిస్తుందనీ, వాటికోసం నేనలా ఆశ్రయించుకుతిరుగుతాననీ మా అమ్మ నన్ను యాసగా దెప్పిపొడుస్తూ వుండేది అప్పుడప్పుడు కాని అవిడది వట్టి తప్పభిప్రాయమని రుజువు చెయ్యగలను. మాఅమ్మ నాకు ఒకపెద్ద వెండి గిన్నెడుపాలు ప్రొద్దునా, ఒ పెద్దవెండిగిన్నెడు పాలు సాయంత్రం త్రాగించేది - పంచదార కూడావేసి. త్రాగకపోతే గవద బద్దలు కొట్టి మరీ త్రాగించేది. మరి ఆ వెండిగిన్నెకోసం గాని, మా అమ్మకోసంగాని, నామనస్సు అలా వెంపర లాడేది కాదేం ?— మా బామ్మ నాకు పట్టెడు పట్టెడు వెన్నపూసా, మీగడా పెడుతూ వుండేది. అవిడకూ నాకూ మధ్య మాత్రం యీ ఆంతర్యమేదీ ?

ఎవళ్ళ లోపం వాళ్ళు కప్పుకోడానికి ఏదో అభూతవాదాన్ని ఒక దాన్ని లేవతీసి ప్రచారంలోకి తెస్తూవుంటారు. మా అమ్మ వాదంకూడా ఆ జాతిలోదే.

రంగు రంగుల పువ్వులు గుత్తులు గుత్తులుగా గుబుల్కొని పుష్పించి పోయిన పూల మొక్కలతోనూ, నాజూకైన సన్న సన్నని తీపి వాసనలు వ్యాపింపజేస్తున్న చిన్ని చిన్ని పిల్ల వాయువులతోనూ. ఎంతోహాయిగా వుంటుంది — ఒక పార్కు. దాన్లోకివెళ్ళి కాసేపు కూర్చొని వద్దామని ఉబలాటపడతాం. ఆ పార్కు గేట్లు దగ్గిర అమ్ముతున్న కారప్పు శనగలు కొనుక్కు తింటానికే మనమక్కడికి వెడుతున్నామనివాదించటం అదేమంతబాగుంటుంది. కారపు శనగ లక్కడున్నై గనక అప్పుడప్పుడు మనం కొనుక్కు తింటే తింటాం గాక - కారపు శనగల కోసమే పార్కులోకి వెడుతున్నారు' అని వాదించటం హాస్యాస్పదం

ఒక్కొక్కవ్యక్తిహృదయం అలా నందనోద్యానవనంలా వుండి సౌరభ్య సౌందర్యాలను ఒలికించుకుంటూ, మానవ హృదయాలను తనలోకి ఆకర్షించుకుంటూ వుంటుంది. మరికొన్ని హృదయాలుంటై — పల్లేరు డొంకలూ, గచ్చపొదలూ, రేతజీబుల ముళ్ళ తోపులూనూ ; ఇంకా కొన్నివుంటై-తడివూక దాళ్లూ, నిప్పులకుంపట్లూ ; మరికొన్ని అసలు గోగులు నానిన మురికి గుంటలు ! ! !

ఇంకా చిత్రం—సుబ్బలక్ష్మి నా కళ్ళల్లోనుంచి నా హృదయంలోకి తొంగిచూసేది వెంటనే నా విషయమంతా ఆవిడకు తెలిసిపోయేది. నాకూ అంతే. ఆ చిరునవ్వులో నాకు స్వర్గ భూముల భోగట్టా అంతా తెలిసేది. ఆ క్రీగంటిచూపుతో మానవ ప్రపంచ విజ్ఞానాన్నంతా 'శక్తివంతం' జేసినట్టు నాలో జ్వలింప జేసేది, ఆ తపస్విని. హృదయంలో వున్న ఆవేశంలో అణుమాత్రమైనా బయటికి చెప్పుకోటానికి చాలని యీ కంటి మానవ భాష మాకేం చాలేదీ ! —

పాలు త్రాగేయీడు బాగా మించిపోయిందని బలవంతాన పాలు మానిపించారు. కాని అదేమిటో నాకు కుతిగానే వుండేది. పాలు నాకక్కరలేదు. ఆ బళ్ళో పడుకుని హాయిగా ఒళ్లుమరచి కన్ను మూయ్యనిస్తేచాలు. ఈ అవకాశాన్నికూడా వాళ్లు అరికట్టడానికి చూస్తున్నారని నాకు మా అమ్మా వాళ్ళమీద యెంతైనా ఉక్రోషంగా ఉండేది దొంగ మాటుగా మా అమ్మని తప్పేసుకొని సుబ్బలక్ష్మి దగ్గిరకు చేరుకునే వాణ్ణి కరుణావాహినిలా కదలి, మునిముని నవ్వుల వెన్నెల తరగల మాలికలతో నన్ను ఆలింగనంలోకి అలుముకుని. గబగబా ఒళ్ళోకి తీసుకునేది— "దబ దబా రెండు గుక్కలు తాగెయ్ !"

అన్నమాటలు నిశ్శబ్దంగా ఆ మాతృ హృదయంలోనుంచి సన్నని నాకంఠ నాళములోకి పుక్కిలింతగా ప్రవహించి పోయేవి.

నాకు పాలివ్వటం ఒకపెద్ద గౌరవంగానే భావించుకుని లక్ష్మి గర్వపడేది. ఎందుకనో—? యీ రహస్యం మట్టుకు నాకు యిప్పటికీ సరిగా అర్ధంకాదు. సుబ్బలక్ష్మి హృదయంలో మూలమూలలకు పారాడి ఆడుకునేవాణ్ణి. ఆ ముత్యాలశాలంతా నాకు కొట్టిన పిండే! యీఒక్క రహస్యంమటుకు నాకు కనిపించకుండా ఎక్కడో గుప్తంగా దాచి పారేశింది. కొంచెం పెద్దవాణ్ణయాక, ఆ భవనమంతా మళ్ళా ఒకసారి కలియవెదికి కనుక్కుందామని బయలుదేరితే - ఆ దివ్య భవనంలోవున్న విద్యుద్దీపికలన్నీ ఒకటొకటే 'టప్' 'టప్'న ఆరిపోయి కన్నూ కన్నూ పొడుచుకున్నాకూడా కనుపించకుండా, అంధకారమావరించి అయోమయమై పోయింది.

గౌతమ దేవులకు పాలిచ్చి తనిపిన మహాప్రజాపతీదేవి కూడా ఇలానే గర్వపడేదని మీరంటే అనొచ్చు. కాని, దీనికీ దానికీ చాలా వ్యత్యాసం వుంది. ఆ తల్లి అలా గర్వపడటానికి తగిన బలవత్తరమైన కారణాలు కనుపించుతున్నై. ఆ మహా శిశువు చక్రవర్తి కాబోతున్నాడనీ, శాక్య సింహాసనానికి ముందెప్పుడో కలగబోయే గౌరవం తన వక్షస్థలం ముందుగానే దక్కించుకుంటున్నదనీ ఆమెకు తెలుసు. అదీగాక, ఆ శిశువు జనించగానే పెద్దపెద్ద జ్యోతిష పండితులంతావచ్చి, ఈ శిశువు ప్రపంచోద్ధరణ చెయ్యటానికి పట్టుకొచ్చిన మహాపురుషుడన్నారు.

మరి నా మాటేమిటి?— నాకు రాజ్యాలేమీ లేవే! పైగా నేను పుట్టినప్పుడు యేజ్యోతిష పండితుడూ వచ్చి నేను గొప్పవాణ్ణవుతానని చెప్పనూ లేదు. నిశ్శబ్దంగానే మా అమ్మను చూడ్డానికివచ్చిన ఆవిడ పినతల్లి మాత్రం - పురుట్లో నేను అహోరాత్రులూ కచ్చబట్టి యేడుస్తూ, మా అమ్మకు నిద్రాహారాలు లేకుండాచేసి వేపుకుతింటుంటే విసుక్కుని, ఎలికపిల్లల్లే కీచుమంటూ, వెధవ .వీడు బ్రతికి నిన్ను ఉద్ధరించి యేడుస్తాడూ? పీకనులిపి ఆ పాటి మీద పారెయ్యి.... చెవులు గింగురెత్తుకుంటూ ఒకటే కీచురాయి రొద.." అందిట. ఆ శాపం ఒక్కటి మినహా, నాకు ఇతర మహదాశీస్సులు కూడా యేమీ ఉన్నట్టు యెవరూ చెప్పరు.

పోనీ లక్ష్మికి బిడ్డలు లేకపోవడంచేత బిడ్డలంటే మోజందామా?... అలానూ అంటానికి వీలులేదు. ఆ తల్లికి కడిపెడు సంతానం. వాళ్ళందరికంటే లక్ష్మి నేనంటే యెక్కువ ఆప్యాయంగా చూసేది

లక్ష్మి బిడ్డలతో నేను ఆడుకొనే వాణ్ణి. వాళ్ళేమన్నా కాస్త నన్ను నొప్పించితే, వాళ్ళను వెంటనే మందలించేది. నేను వాళ్ళనేమి చేసినా నన్నేమి అనకపోగా, వాళ్ళు 'తల్లిగదా' అని తనతో చెప్పుకోవస్తే— "పాపాయితో పోట్లాడుతున్నారా?—" అని ఎదురు తన బిడ్డలనే మందలించుకొని, వచ్చి నన్ను ఎత్తుకొని బుజ్జగించేది. నా దురుసుతనాన్నీ, నాదుర్మార్గాన్నీ, తన కన్నబిడ్డలెత్తి చూపినా ఆ తల్లి సహించేదికాదు. ఆ మాతృమూర్తి హృదయంలో నా మీద అంత కరుణ ఏమిటో!!—

ఆ తల్లికి నే నెప్పుడూ యే విధంగానూ సాయపడ లేకపోయాను. నాది అదొక దౌర్భాగ్య జీవితం. నాకు లవలేశ మేదైనా జీవితంలో సుఖశాంతు లిచ్చిన యే వ్యక్తికీ, నావల్ల చిల్లి గవ్వైనా ప్రత్యుపకారం జరగలేదు—ఇంతో అంతో సంతోషంతప్ప నేనే వ్యక్తికైనా అనవసరంగా కొంచెం చెయ్యి ఆసరా ఇవ్వబోయానో, వాడల్లా నాదొక్కలో ఏదో ఒకబాకు పోటు పొడిచే తీరాడు.

అసలా దేవమూర్తికి నేను సహాయం చెయ్యటమనేది వట్టి లేకిమాట - వట్టి అపవిత్రమైన భావంకూడానేమో! ఆ స్త్రీమూర్తి బానిసకాదు, ఆ యీ మనుష్యుల ముష్టిమీద ఆధారపడి బ్రతకటానికి తన జీవిత సర్వ

స్వాన్ని తన రెక్కల కష్టంమీద ఆధారపడి నిర్మించి, నిర్వహించుకున్న ధీశాలిని ఆ తల్లి. పొరపాటున, అలాంటిమాట నేను నోరుజారి అనేఉంటే, నావంక ఒక ఓరకంటిచూపు చూచి ఒక్క చిరునవ్వుతో, నేను వట్టి లేకి మనిషినని చెప్పేనేసేదే - ఏనాడో.

ఒకసారి ఇలానే జరిగిందట. లక్ష్మి నాకు పాలిస్తోందని, ఏదైనా ముట్టజెప్పి చేతులు కడిగేసుకుందామని మా అమ్మ కొంతపైకం లక్ష్మి చేతిలో పెట్టబోయిందట. "ఏమిటది?" అందిట లక్ష్మి. "ఇవి నువ్వుతీసుకో లక్ష్మీ!. పసిగుడ్డును బ్రతికించుతున్నావు .ఏమిస్తే మటుకు ఋణం తీరుతుందిగానీ..." అందిట మా అమ్మ. వెంటనే లక్ష్మి ముఖం కందగడ్డ చేసుకుని "చాల్లెండి!... ఎవరన్నా వింటే నవ్విపోతారు. . పసిబిడ్డకు నాలుగు ధారలు పాలచుక్క లిస్తున్నాటా .. అందుకనీ కూలిస్తారుట! .చనుబాలమ్ముకుని బ్రతుకవలసిన చెడురోజులుకూడా వస్తే అప్పుడిద్దురుగాని లెండి....ఏదో రెక్కలకష్టంచేసుకుని బ్రతుకుతున్నానుగా." అం చాలా చిరాకుపడ్డదిట. ఇంత అల్పకాలంలో - తన దేశంలో కొనుక్కోటానికి కూడా బ్రెపాలైనా దొరక్క, పసిగుడ్లు, లక్షలకు లక్షలు కలకత్తా వీధుల్లో కంకాళాలుగా రాలిపోవలసి వస్తోందని - ఆతల్లి ఆనాడు ఊహించుకోగలిగివుంటే, ఆ తల్లి కరుణాహృదయం ఎంత కోసుకు పోయేదో!

తన రెక్కల కష్టంమీద తను బ్రతకగలననే ఆ ఆత్మవిశ్వాసం, ఆతేజోమయ హృదయంలో ఒకజ్యోతిలా వెలుగుతూ కనిపించేది. ఎవరైనా ఏదైనా ఊరికె తన చేతిలో పెట్టవస్తే చాలా కంటగించుకొని "ముష్టి వేస్తారా?". .అనేది. ఆ జీవితం ఒక అసిధారావ్రతం. ఏ పూటకాపూట తన కంచంలో ఉన్న మెతుకులు తన రక్తంలోనుంచి పుట్టినవా కావా? అని అణు చూసుకొనేది. ఆ తల్లి గంభీరమైన ఆఆత్మవిశ్వాసాన్ని జ్యోతిగా చేసుకొని తన జీవితాన్నంతా తేజోమయం చేసుకుంది ఆ మాతృశ్రీ—

* * * *

ఆ రోజు స్వర్ణ సంక్రాంతి మా యింట్లో బూరెలు వండుకున్నారు, మా అమ్మ నాకు ఒకబూరెముక్క చేతికిచ్చింది. 'సుబ్బలక్ష్మికో మరి?.. " అనిపించింది నా మనసుకు. రెండోచెయ్యి చాచాను. ఆ చేతికికూడా ఇంకొకటి అందించింది. అవి రెండూ తీసుకొని సుబ్బలక్ష్మికోసం దొడ్లోకివెళ్ళాను. సుబ్బలక్ష్మి పీపుమీద పడుకుని భుజంమీదుగా చెయ్యి ముందుకు పోనిచ్చి నోటికందివ్వ బోయాను. లక్ష్మి ఆపి, ఆ ముక్కతీసి చేత్తోబట్టుకొని

"తినూ"—అంది.

"ఇదిగో నాకూ" అని రెండో బూరెముక్క చూపించాను.

"ఇదికూడా తిను"

"ఊహుం...."

"ఏం?..."

"నువ్వు తిను"

"వద్దులే. .నువ్వేతిను"

"ఊ....తినూ...." అని మారాం చేశాను.

నోట్లోపెట్టుకోబోయింది. మళ్ళా, ఎందుకనో—చటుక్కున ఆగి—కళవళంగా— "అలా నేతినగూడదులే.... నువ్వే తిను. ." అని నా చేతికిచ్చేసింది. నన్ను తృప్తిపరచడానికి, మొదట్లో యేమీ ఆలోచించకుండా నోట్లోబెట్టుకో బోయింది. కాని మళ్ళా యేదో మత్తులోనుంచి మేలుకున్న మనిషిలా, చివాల్న ఆగి, కంగారుగా "కాదులే.. అలా నేను, అలాతినగూడదులే ...అంటూ ఆబూరెముక్క నా చేతికిచ్చేసింది. నాకెందుకో యేడుపు ముంచుకొచ్చేసింది. రెండు గ్రుడ్ల నిండా గిర్రున నీళ్లు తిరిగాయి.

"ఏమిటి నాన్నా!....ఎబ్బే....ఏమిటి?.... ఎందుకు?—"

బిగ్గరగా ఏడిచేశాను—

"నాన్నా! ఊరుకోవూ? ...అలా ఏడవ

కూడదమ్మా!. అలా నేను తినగూడదూ... మా నాన్నగాదూ ... అలానైతే నీ జబ్బు ఉండదు." అన్నది

ఏడుపు మ్రింగేశాను. ముఖం చిట్లించుకుని, ఆ రెండు బూరెముక్కలు పుచ్చుకొని పడమటింటి గుమ్మంలోకి వచ్చి వాటిని అక్కడ కూర్చున్న మాఅమ్మముంద గిరవాటు బెట్టాను. చిక్కముఖంబెట్టి, గోళ్ళు గిల్లుకుంటూ, ఆ గుమ్మానికి ఆనుకొని నిల్చున్నాను. అదిచూసి, మా అమ్మ

"ఏం? దాహుడు చాల్లేదా:"—అని కసిరింది.

నేను మాట్లాడలేదు గోళ్ళు గిల్లుకుంటు నిలుచున్నాను.

"బెల్లంకొట్టిన రాయిలా మాటకూడా పడి పోయిందేం?"—

మాట్లాడలేదు.. గోళ్ళు గిల్లుకుంట న్నాను. ఇంకో బూరెముక్కవాటికి జతజేసి ఊ! ఈగో!. వెళ్ళు' అంటూ న చేతిలో బెట్టొచ్చింది. నేను పుచ్చుకోలేదు రెండు గ్రుడ్లనిండా నీళ్ళు తిరిగాయి. మ అమ్మకేమీ అర్ధంకాలేదు. "ఏమిటి నాయనా!" అంటూ అదుర్దాగా, దగ్గిరికి తీసికోబోయింది. బిగ్గిరిగా యెక్కెక్కి యేడ్చేశాను అంతా చుట్టూ మూగారు ఎందుకేడుస్తున్నానో ఎవ్వరికీ తెలియలేదు." "చీమకుట్టింద"న్నారు కొందరు. "తేలేమో" నన్నారు మరికొందరు 'పిల్లినిజూచి భయ పడి వుంటాడు' అని నిర్ధారణ చేశారు ఇంకా తెలివిగలవాళ్లు. అక్కడున్న ఒక మహాయోగి ఒక్క క్షణం కళ్ళుమూసేసి, మళ్ళా తెరిచి, చిటికవేస్తూ, అవులించి... 'ఇస్సో రంగా!... సరే! నాకంతా తెలిసి పోయింది లెండి; మరేం ఫరవాలేదు కొంచెం వీభూదీ, సాంబ్రాణి, ఒక కొబ్బరి కాయ, పంచెవన్నెల నూలూ తెప్పించండి ఇప్పుడే పని చేసేసేద్దాం'—అంటున్నాడు.

ఈ రాద్ధాంతమంతా వింటుంటే నాకు మరింత యేడుపు ముంచు కొచ్చేస్తోంది, అసలు అదేమిటో నాకు అయోమయమయి పోతోంది. ఇక ఆ యేడుపు స్వాధీనం తప్పి పోతోంది. ఆపుకుందామని యెంతో ప్రయ త్నించాను. ఆపుకోలేక పోయాను.

నేను ఎక్కెక్కి యేడవటం దొడ్లోకి వినిపించి సుబ్బలక్ష్మి నడవాలోకి వచ్చింది దూరంగా నిల్చుని నావంక అదోలా - ఒక చూపు చూసింది. దానిఅర్ధం నాకు తెలుసు. 'నీవలా యేడవటం నాకు యిష్టంలేదు - నీవు వెంటనే మాను'—అని ఆ చూపుకు అర్ధం. అదినాకుతెలుసు. ఆపుకోవాలని ప్రయత్నించు తూనే వున్నాను. ప్రయత్నించినకొద్దీ, వెల్లు వలా దుఃఖం నన్ను ముంచివారేస్తోంది.

ఆపాదమస్తకం కంపిల్లిపోతూ, ఒణికి పోతున్న గొంతును అలాఅలా స్వాధీనానికి తెచ్చుకుని బలవంతాన పైకి పెగుల్చుకుని....

'నాన్నా!' అని దీనంగా అర్చింది.

నిండి తొణికిసలాడుతున్న అక్కడున్న నీళ్ళగంగాళం కంగారై, గజిబిజిగా ఏమిటో కళవళించి పోయింది అయోమయంగా. 'జివ్వు' మంటూ ఈ దుఃఖ గీతిక అసావది అంతా వ్యాపించి, 'జిమ్ము' మని ముసురు వేసిపోయినట్లయింది ఆ అనాహతరావం ఇప్పటికీ నా రక్తనాళాల్లో మారుమ్రోగు తూనేవుంది.

నా మేధస్సులోవున్న సర్వనాడులూ, స్తంభించి దిమ్మెక్కిపోవటం తప్ప ఆ ఆర్త సంఘోషణానికి అర్ధమేమిటో నాకు అప్పుడిక బోధపడలేదు. ఇప్పుడిప్పుడు ప్రపంచాన్ని అర్ధంచేసుకోగా చేసుకోగా, నా కళ్ళయెదుట ఒక శోకమూర్తిగా విచ్చులుకుని కనుపించు తోంది. ఈ దీనారావంలో మానవ హృదయ గుహాకుహారంలో ఘూర్ణిల్లుతున్న ఆ విషాద గాధంతా నెలయేళ్ళ శోకనినాదంలాగు నిరం తరం నా రక్తనాళాల్లో మారుమ్రోగుతూ నన్ను కలవర పరుస్తూనేవుంది. ఆ పిలుపు నాకుకాదు నాలో యుగయుగాలుగా చివికి చివికి నిర్జీవమై నశించి పోతున్న నా మానవత్వానికే.

ఆ పిలుపు విని, మా అమ్మ ఆ మూర్తి వంకదీనంగాచూసి, "సుబ్బలక్ష్మి !....పిల్లడూ ... ఇదేమిటీ ?" అని బెంబేలు పడ్డది

"ఏమీ లేదు ; కలవర పడకండి ; ఇలా ఇవ్వండి"—

మా అమ్మనన్ను సుబ్బలక్ష్మి చేతుల్లోకి అందించింది నన్ను భుజాన వేసుకొని దొడ్లోకి తీసుకువెడుతూ 'మీరిలా రండీ' అని మా అమ్మను పిలిచి వెంట తీసుకు వచ్చింది. సుబ్బలక్ష్మి పటమటింటి మొత్త చాటుకు వచ్చి ఆగి, నన్నుచూసి, "తింటాను మరి.... యేడవకేక"—అంది. మా అమ్మ వంక తిరిగి .."ఆబూరెముక్కలిలా తెండి. ...నాక్కూడా ఒకటి తెండి" అనేసింది బలవంతాన పెగుల్చుకొని నాకోసం ఆ తల్లి తన అభిమాన హృదయాన్ని చివుక్కున రెండుగా చీరుకుంది. ఆ బాధంతా గజ గజా ఒణికి కంపిల్లిపోయిన ఆ పెదవుల్లో నుంచి విద్యుత్తరంగంలా దూసుకువచ్చి నా హృదయానికి కొట్టుకోనే కొట్టుకుంది.

మా అమ్మ లోపలికిపోయి బుట్టా బుట్టా తెచ్చి అక్కడ పడేసి, "ఈగో సుబ్బలక్ష్మి ! ... తనకెన్ని కావాలో అన్ని తీసుకోమను" —అంది.

ఎన్నో అక్కర్లేదు—రెండుచాలు. ..ఇలా యివ్వండి అని రెండు ముక్కలు తీసికొని "ఇదిగో ! నేనూ తింటున్నాన. తీసుకో !. ఏడవకు మరి"—

వర్షంచటుక్కున ఆగిపోయి, మబ్బుతునక ప్రక్కకుతప్పుకోగానే, తెరదించినట్టుచరాల్న నీరెండ వ్యాపిస్తుంది. కన్నీటి పొరజాలులో మునిగిపోయిన నా కనుకొలకులలో, కాంతి రేఖలు మిలమిలా బూరె మునిపంట కొరికాను..... యెక్కిళ్ళు ఒకటొక్కటే తగిపోతున్నాయి

ఏదో ఒకటిచెప్పి వాళ్ళనందర్నీ అవతలికి పంపించి వెయ్యండి.... పిల్లడి చేత మారాం చేయించి ఇంట్లోనుంచి అవీ యివీ తెప్పించుకు తింటుందనుకుంటారేమో ? ...సిగ్గుబొట్ల పనీ"—అన్నది సుబ్బలక్ష్మి—అవమానంతో అటమటించి పోతూ—

★

ఆంధ్ర సాహిత్య పారశాల

"ఒకే ఆదర్శంకోసం వచ్చిన వారందరు ఒకచోటికి చేరి విషయచర్చ గావించటం వలన చాలా విషయాలు సేకరించగలిగాను.- నా ఆదర్శాలకు పునాది చేకూరింది."

కొట్టగడ్డ నరసయ్య,
(కాశీ విశ్వవిద్యాలయం విద్యార్థి.)

★

"పారశాల - నిర్మాణ కార్యక్రమమునందేమి, విద్యార్థుల, ఉపాధ్యాయుల పరస్పర సాహచర్యమునందేమి, నిర్మాణ కార్యక్రమమును తు. చ తప్పకుండ నెరవేర్చుటయందేమి- నన్నెంతో ముగ్ధుని జేసినది.

"ప్రతి విద్యార్థి తమ తమ రంగములలో అభ్యుదయ సాహిత్యమును గూర్చి ప్రచారముచేసి మూల మూలలకు పల్లె పల్లెలకు ఈ సందేశము గొనిపోయి నూతన భారత నిర్మాణమునకు పునాది వేసెదరని కోరుచున్నాను "

పొందూరి సత్యనారాయణ,
(హెడ్మాష్టర్, హిందూ ప్రాథమికపారశాల, పొందూరు.)